

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్
బుధవారం 11, నవంబర్ 2026

బాలోత్సవ్ భళా

ఖమ్మంలో అట్టహాసంగా ప్రారంభం..రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన బాలలు



వనం నాగయ్య, కెరటం న్యూస్

మనదేశ కళల వారసత్వాన్ని ప్రతి తరం వారు కొనసాగించాలని రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల ప్రారంభ సభలో జిల్లా అడిషనల్ పోలీస్ కమిషనర్ రామానుజం తెలియజేశారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ వేడుకల ప్రారంభోత్సవానికి అడిషనల్ సిపి రామానుజం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశానికి చెందిన కళారూపాలు ప్రపంచ వ్యాప్తంగా అందరినీ ప్రభావితం చేస్తున్నా యని తెలిపారు. మన సాంప్ర దాయ జానపద కళారూపాలకు రోజు రోజుకూ సినిమాల్లోనూ అత్యధిక ప్రాధా న్యత పెరుగుతోందని తెలిపారు. పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేలా తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహిం చాలని కోరారు. పిల్లలు సెల్ఫోన్ బానిసత్వానికి గురికాకుండా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సృజనాత్మకతను పెంపొందించే కళలను నేర్చుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా, దృఢంగా రూపొందుతారని, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఖమ్మం బాలోత్సవ్ సంబురాల సభలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనడమే పిల్లలకు గొప్ప విజయం అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సంబురాలో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ జంగాల సునీల్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, డాక్టర్ కాటమనేని రాజకుమార్, నృత్యదర్శకులు ఆర్ ఎన్ ప్రసాద్, న్యాయ నిర్ణేతలు లింగం శ్రీనివాసరావు, జైపాల్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ బాధ్యులు చిక్కుళ్ల వెంకటేష్, పగిల్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్ ,రాజేష్ ,భవాని శంకర్, ముకేశ్, నాని,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నృత్యాలు.

వారధి ఫౌండేషన్ ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు హోరె త్తాయి. బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, పలు జిల్లాల నుంచి బాలలు 300 మందికి పైగా పోటీలో పాల్గొన్నారు. తొలి రోజు సాంప్రదాయ విభాగాలో జూనియర్, సీనియర్ విభాగా లో బాల బాలికలు తమ సృజనాత్మ కతకు దర్పణం పట్టారు. నెమళ్ళు నాట్యం ఆడినట్లుగా సాంప్రదాయ వస్త్రధారణలో సంగీతానికి అనుగుణంగా స్టెప్పు లేస్తూ బాలల ప్రదర్శించిన నృత్యాలు సబికులను ఉర్రూతలుగించాయి. అతిపెద్ద డిజిటల్ స్క్రీన్ పై , డిజిటల్ లైట్ల వెలుగులతో బాల బాలికలు ప్రదర్శించిన నృత్యాలను తల్లిదండ్రులు తిలకించి మురిసిపోయారు.



చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలన్ని సబికులని కనువిందు చేశాయి. సోలో క్లాసికల్, ఫోక్ డాన్స్ విభాగాలకు 200 ఎంట్రీస్, గ్రూప్ క్లాసికల్, ఫోక్ డాన్స్ కు గాను 40ఎంట్రీస్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగా నికి 50ఎంట్రీల ద్వారా బాల బాలికలు తమ సృజనతో కనువిందు చేస్తున్నారు. ఖమ్మం బాలోత్సవ్ పోటీలు గురువారం సాయంత్రం వరకు జరుగుతాయని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో అతిధులు బహుమతి ప్రధానం చేస్తారని వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ నిర్వాకులు తెలియజేశారు. ఖమ్మంలో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ కు బాల బాలికల నుంచి అనూహ్య స్పందన రావడంతో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తున్నాయి.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యంపై

బీజేపీ ఆగ్రహం

వనం నాగయ్య, కెరటం న్యూస్

ఖమ్మం నగరంలోని మున్నేరు వాగుపై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి పనులను బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండున్నర సంవత్స రాలు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడం వల్ల ప్రజలు, వాహన దారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఇంజనీర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి సమీపంలోని ఇళ్లలోకి దుమ్ము, ధూళి చేర కుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకో వాలని, ట్రాఫిక్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. అధికారుల పర్యవేక్షణ లోపాలు, నిర్మాణ జాప్యాన్ని వెంటనే సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బారావు, డోకుపర్తి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు రవి రాథోడ్, రాష్ట్ర మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్ రాథోడ్, అనిత, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కోశాధికారి కొనతం లక్ష్మీనారాయణ, ఆఫీస్ సెక్రటరీ రవి గౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కందుల శ్రీకృష్ణ, మోర్చా అధ్యక్షులు ఆర్.వి.ఎస్. యాదవ్, నరుకుల వెంకటేశ్వర్లు, రీగల్ ప్రతాప్, శాసనాల సాయిరాం, ఈదుల వీరభద్రం, వీరభద్ర ప్రసాద్, శ్రీలక్ష్మి, రెడ్డి వెంకటరమణ నాయకులు పాల్గొన్నారు.



కేబుల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



కారేపల్లి, కెరటం న్యూస్

కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి పేకాట రాయుళ్ల ఆట కట్టించారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వి. రమేష్ రెండో రోజే పేకాట స్థావరంపై దాడి చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం గ్రామ శివారులో సుమారు ఎనిమిది మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించిన పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన ఆరుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారవగా, ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ దాడిలో రూ.13 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెంచడంతో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిలో ఆందోళన మొదలైంది. నూతన ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన వెంటనే పేకాట స్థావరంపై దాడి చేయడం పట్ల స్థానికంగా చర్చ జరుగుతోంది.

కారేపల్లి ఎస్ఐ రమేష్‌కు డీవైఎఫ్ఐ స్వాగతం



కారేపల్లి, కెరటం న్యూస్

కారేపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వి. రమేష్‌ను డీవైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి అదేర్ల వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కారేపల్లి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు నూతన ఎస్ఐ కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, యువతకు సరైన మార్గనిర్దేశం చేయడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని, మండలంలో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు యువజన సంఘాల తరఫున తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వి. రమేష్‌కు డీవైఎఫ్ఐ నాయకులు మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు, యువజన నాయకులు తదితరులు డీవైఎఫ్ఐ ముఖ్యులు పాల్గొన్నారు.

కారేపల్లి అభివృద్ధిపై సమీక్ష..



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఆలేటి ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మతో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై శాఖల వారీగా సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి శాఖ పనిచేయాలని పేర్కొన్నారు.

మల్బరి సాగు-పట్టు పురుగుల పెంపకంతో

రైతులకు అధిక ఆదాయం



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

వైరా మండలంలోని రెబ్బవరం గ్రామంలో మల్బరి పంట సాగు మరియు పట్టు పురుగుల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో రైతు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై శాస్త్రీయ పద్ధతులపై మార్గదర్శకత్వం పొందారు. సదస్సులో శాస్త్రవేత్త భవిత, తిప్పమ్ రెడ్డి మాట్లాడుతూ, మల్బరి పంటను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసి పట్టు పురుగుల పెంపకం చేపడితే తక్కువ వ్యయంతో అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టు పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరిం చారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ, పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, గృహాల పరిశుభ్రత, ఉష్ణోగ్రత–ఆర్ద్రత నియంత్రణ, సమయా నికి ఆహారం అందిం చడం వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. పట్టు పురుగుల్లో సాధారణంగా కనిపించే రోగాలు, వాటి లక్షణాలు మరియు నివారణ చర్యలపై కూడా శాస్త్రవేత్తలు వివరించారు. తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ అదనపు సంచాలకులు లత మాట్లాడుతూ, మల్బరి తోటల సమగ్ర నిర్వహణ, ఎరువుల వినియోగం, నీటి పారుదల, ఆకుల నాణ్యత మెరుగుదల వంటి అంశాలపై రైతులకు సూచనలు ఇచ్చారు. అలాగే పట్టు పురుగుల పెంపకం విధానం, సరైన సమయంలో పట్టు గుళ్ళ తీత మరియు మార్కెటింగ్ పద్ధతులపై రైతులకు ఉపయోగకరమైన మార్గదర్శకత్వం అందించారు. ఖమ్మం పట్టు పరిశ్రమ అదనపు సంచాలకులు అనసూయ మాట్లాడుతూ, మల్బరి సాగు మరియు పట్టు పురుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలు, సబ్సిడీ అవకాశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లాడుతూ, కొత్తగా పట్టు పరిశ్రమలోకి రావాలనుకునే రైతులు ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకొని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బవరం రైతుల భూసార మరియు మల్బరీ ఆకులను పరీక్ష నిమిత్తం సేకరించి ల్యాబ్ లో పరీక్షల నిమిత్తం తీసుకువెళ్ళినారు. ఈ కార్యక్రమం తరువాత రెబ్బవరం గ్రామములోని పట్టు రైతుల భూసార మరియు మల్బరీ ఆకులను పరీక్ష నిమిత్తం సేకరించి ల్యాబ్ లో పరీక్షల నిమిత్తం తీసుకువెళ్ళినారు. ఈ కార్యక్రమంలో సహాయ పట్టు పరిశ్రమ అధికారులు కామేశ్వరరావు, దేవరాజు తదితరులు పాల్గొని రైతులకు సాంకేతిక సలహాలు అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు.

విద్యతోనే సమాజ ప్రగతి..

త్రివేణి డైరెక్టర్ డా. గొల్లపూడి

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఖమ్మంలోని త్రివేణి పాఠశాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషి, విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, అందరికీ నాణ్యమైన విద్య అందించాలనే ఆయన ఆశయా లను విద్యార్థులకు వివరించారు. డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. విద్య అనేది వ్యక్తి వికాసానికే కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా అత్యంత శక్తివంతమైన సాధనమని అన్నారు. ప్రతి విద్యార్థి విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంతో పాటు సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, నూతన ఆలోచనా విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సమాన విద్యావకాశాలు కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



మిరప పంటలో నల్ల తామర నివారణకు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

మిరప పంటలో నల్ల తామర నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మరియు సీఏబీఐ స్వచ్ఛంద సంస్థ వారు సూచించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉద్యాన శాఖ అధికారులు, అభ్యుదయ రైతులకు మిరపలో నల్ల తామర ఉధృతి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో అధిక విస్తీర్ణంలో మిరప సాగు చేస్తున్నారని, ప్రస్తుతం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నల్ల తామర పురుగు ఆశించినట్లు గుర్తించామని తెలిపారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్పిస్తూ, పంట నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన జిల్లా ఉద్యాన అధికారులు తమ జిల్లాల్లో మిరప సాగు పరిస్థితులు, పంట వివిధ దశల్లో ఉన్న తీరు, నల్ల తామర ఉధృతి వివరాలను శాస్త్రవేత్తలకు తెలియజేశారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్తలు డా. అనిత, డా. ప్రశాంత్, డా. పావని మరియు సీఏబీఐ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మంజరి రైతులకు నల్ల తామర నివారణకు చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. పంటను నిరంతరం పరిశీలించడం, పురుగు ఉధృతిని గుర్తించడం, అవసరమైన నివారణ చర్యలను సకాలంలో చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే మొబైల్ యాప్‌ల సహాయంతో పంటలో వచ్చే తెగుళ్లు, పురుగులను గుర్తించి తగిన నివారణ చర్యలు తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యాన అధికారులు, అభ్యుదయ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ మధుసూదన్

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని

పెంపొందించడమే లక్ష్యం



సత్తుపల్లి, కెరటం న్యూస్

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. జిల్లా స్థాయి క్రీడలు, ఆటల పోటీలను బుధవారం ప్రారంభించిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఈ సందర్భంగా క్రీడలను ఉద్దేశించి ప్రసంగించారు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలో ఘనంగా ప్రారంభమైన డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026కు మంచి స్పందన లభించిందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులను అభినందించి, ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు ఎంతో కీలకమని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, చక్కటి ఏర్పాట్లు చేసిన పాఠశాల ప్రిన్సిపాల్‌కి, ఉపాధ్యాయ బృందానికి మరియు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గం, పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుప్పెనకుంట్ల గ్రామ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భగవాన్ బిర్సాముండా జయంతిని

ఘనంగా నిర్వహిస్తాం..నెల్లూరి



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

గిరిజన మోర్చా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాజ్ నోత్ భద్రం అధ్యక్షతన నవంబర్ 15న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ః75 ఏళ్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 2021 నుండి బిర్సా ముండా జయంతిని జాతీయ గిరిజన గౌరవ దినోత్సవంగా (జన్‌జాతీయ గౌరవ్ దివస్) దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. గిరిజన నాయకుల గొప్ప చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను బిజెపి ప్రభుత్వం పరిరక్షిస్తోందని స్పష్టం చేశారు. దేశాన్ని 55 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని విస్మరించిందని దుయ్యబట్టారు. దేశంలో ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బిజెపికే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ఎంతో మంది గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని కొనియాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తాజ్ నోత్ భద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. శ్యామ్ రాథోడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజన మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమంపై ప్రస్తుత ప్రభుత్వం కల్లిబొల్లి మాటలు తప్ప ఏమీ చేయడం లేదని విమర్శించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రవి రాథోడ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన 'చేవెళ్ల డిక్లరేషన్'ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి, గిరిజనుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన పోరాట యోధుల చరిత్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతలో స్ఫూర్తి నింపాలని, మందడపు సుబ్బారావు, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శులు రమేష్, రాహుల్, నాయకులు శ్రీకృష్ణ, సాయిరాం, వీరభద్రం, రమేష్ పాల్గొన్నారు.

మున్నూరు కాపుల సంక్షేమం,

అభివృద్ధికి కృషి చేస్తాం



వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి

ఖమ్మం నగరంలోని మున్నూరు కాపు బాలుర వసతి గృహంలో తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఆర్జేసి కృష్ణ, జిల్లా కార్యదర్శిగా బచ్చు విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఆర్జేసి కృష్ణ మాట్లాడుతూ తమపై నమ్మకంతో జిల్లా కమిటీ బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సమాజ అభ్యున్నతికి, సంక్షేమానికి, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. సమాజంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, యువతకు సరైన మార్గదర్శనం కల్పిస్తామని తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యతను బలోపేతం చేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లా కార్యదర్శి బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపు కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా ముందుకు నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులకు విద్యా పరంగా ప్రోత్సాహం అందించడం, యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, సంఘంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటూ నాయకులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మున్నూరు కాపు ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ లక్కినేని రఘు మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజం విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కమిటీ నాయకత్వంలో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తూ, యువతకు మరియు విద్యార్థులకు ప్రోత్సాహం అందించి, సమాజ అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లక్కినేని సుధీర్ మాట్లాడుతూ మున్నూరు కాపుల ఐక్యతే సమాజ అభివృద్ధికి ప్రధాన బలమని, ప్రతి ఒక్కరూ సంఘం కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. నూతన కమిటీకి తమ సంపూర్ణ సహకారం అందిస్తూ సమాజ సంక్షేమం కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, జేఏసీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులు మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని వెల్లడించారు.

